క్లుప్తంగా

యథేచ్ఛగా చేపలు, మాంసం విక్రయాలు



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాల సాక్షిగా సాగుతున్న వ్యాపారాలు

కరప: గణతంత్ర దినోత్సవం రోజున చేపలు, మాంసం విక్రయాలు చేయరాదని అధికారులు ఆదేశించినా ఆదివారం మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ల సాక్షిగా కొనుగోళ్లు, విక్రయాలు యథేచ్ఛగా సాగిపోయాయి. కరప, నడకుదురు, వేళంగి, గొర్రిపూడి తదితర గ్రామాల్లో మాంసం, చేపల విక్రయాలు సాగించారు. అధికారులు సైతం ఈ విక్రయాలను చూసీచూడనట్టు వదిలేయడం విమర్శలకు దారితీసింది.

హాకీ క్రీడాకారులకు కిట్ల పంపిణీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 జాతీయ స్థాయి హాకీ పోటీలకు హాజరవుతున్న క్రీడాకారులకు కార్యక్రమ ముఖ్య అతిథి డీఎస్డీఓ బి.శ్రీనివాస్ ఆదివారం క్రీడా కిట్లను పంపిణీ చేశారు. డీఎస్ఏ మైదానం హాకీ మైదానంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎల్.జార్జి అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాంచీలో జరిగే జాతీయ ఎస్జీఎఫ్ఐ హాకీ పోటీలకు హాజరవుతున్న రాష్ట్ర జట్టుకు అవసరమైన స్పోర్ట్స్ కిట్‌ను రాష్ట్ర ఎస్జీఎఫ్ఐ కార్యదర్శి భానుమూర్తి రాజు, పాఠశాల విద్యా రాష్ట్ర కమిషనర్ ఆదేశాలతో కిట్లను అందజేస్తున్నామన్నారు. కోచ్ రవిరాజు మాట్లాడుతూ తమ జట్లు ఈ క్రీడల్లో పతకం సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు జార్ఖండ్‌లోని రాంచీలో జరిగే అండర్-19 68వ జాతీయస్థాయి ఎస్జీఎఫ్ఐ పోటీలకు 18 మంది బాలురు, 18 బాలికలను రాష్ట్ర జట్టుగా పాల్గొంటున్నారు. అనంతరం డిఎస్డీఓ క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు, ట్రెజరర్ రవికార్, ఎస్జీఎఫ్ఐ జిల్లా సంయుక్త కార్యదర్శులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్: మండలంలోని నేమాం గ్రామ శివారులో శక్తి గ్యాస్ కంపెనీ ఖాళీ స్థలంలో వ్యక్తి మృత దేహం లభ్యమయ్యింది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్ళ మధ్య ఉంటుందని, మృతుని ఒంటిపై నలుపు రంగు నిక్కర్ ఉండి దానిపై రాయల్ అని ఉందని వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రవీంద్రబాబు కేసు నమోదు చేశారు. గ్రామాలలో ఎవరైన కనిపించకుండా పోయిన వారు ఉంటే తమను 98488 51123, 94407 96556 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని ఎస్సై కోరారు.

వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు

కరప: మండలం గురజనాపల్లి శివారు అడవిపూడి గ్రామంలో ఆదివారం వెంకటరమణ మెడికల్స్ (నడకుదురు) వ్యవస్థాపకుడు యాసలపు విష్ణుమూర్తి ఆధ్వర్యంలో వెంకటసాయి క్లినిక్ వైద్యుడు ఆర్.శివప్రసాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. అడవిపూడి, గురజనాపల్లి పరిసర గ్రామాల నుంచి 300 మంది రోగులు శిబిరానికి రాగా డాక్టర్ శివప్రసాద్ బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మండల కెమిస్ట్స్, అడ్రగిస్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కాకినాడ జిల్లా డ్రగ్ ట్రేడర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రతినెల చివరి ఆదివారం నడకుదురులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, ప్రజలు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు పాటిస్తూ, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు.

గిట్టుబాటు ధర చట్టం తీసుకు రావాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గిట్టుబాటు ధర చట్టం తీసుకు రావాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనే డిమాండ్లతో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణకై ఇచ్చిన దేశవ్యాప్త పిలుపు మేరకు ఈ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన వల్ల రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడి, పౌర హక్కులకు భంగం వాటిల్లిందని అన్నారు. మనుధర్మ శాస్త్రాన్ని పునఃప్రతిష్ఠించేందుకు మతోన్మాద శక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయన్నారు. కనీసం అంబేద్కర్ పేరు తలచుకోవడాన్ని కూడా వివాదం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర చట్టం రూపొందించేంత వరకూ, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకూ ప్రజాస్వామిక వాదులు ముందుకు రావాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, కోశాధికారి మలకా రమణ తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీకి నివాళులర్పిస్తున్న కౌడా చైర్మన్ తుమ్మల బాబు, వీసీ భావన



రమణయ్యపేటలో ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో జాతీయ జెండాను ఎగరవేస్తున్న కమాండెంట్ దీపిక



కాకినాడ కోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఎగురవేసిన మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి



కరప ఎంపీడీఓ కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ అనుపమ, ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సుబ్బారావు తదితరులు

గగనాన సగర్వంగా తిరంగా..

- వాడవాడలా గణతంత్ర దినోత్సవాలు
- ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ పతాక ఆవిష్కరణలు

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో ఆదివారం గణతంత్ర వేడుకలు వైభవంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఆవరణలోని మహాత్మగాంధీ విగ్రహానికి జేసీ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు పూలమాలల వేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నగర కార్యాలయంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షురాలు మాజీ మేయర్ సుంకర శివప్రసన్న జాతీయ జెండా ఆవిష్కరించారు. ఎందరో త్యాగధనుల పోరాటం ఫలితంగా మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వేంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు స్థానిక 27వ డివిజన్‌లో జాతీయ జెండా ఆవిష్కరించారు. జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో డీపీఆర్వో, డిప్యూటీ డైరెక్టర్ నాగార్జున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పి.రవి, ధర్మరాజు, బషీర్ పాల్గొన్నారు. స్థానిక 48వ డివిజన్‌లోని ప్రజా విద్యాలయంలో గణతంత్ర వేడుకలు వైభవంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించారు. సంస్థ నిర్వాహకులు వక్కలంక రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ నాయకులు శ్రీరామచంద్రమూర్తి, సతీష్, కందిల్లి వెంకట్ పాల్గొన్నారు. స్థానిక కచేరీపేట సుందరయ్య భవన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు ఏవీ నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు. డీసీసీబీ కార్యాలయంలో సీఈఓ ఆర్వీ నరసింహారావు, జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీఓ రవికుమార్, స్థానిక దేవదాయశాఖ కార్యాలయంలో డీసీ రమేష్‌బాబు, సహకారశాఖ కార్యాలయం, వ్యవసాయశాఖ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ ఆనందరావు. చిత్రంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1, 2 రామారావు, వీరభద్రరావు, ఉద్యోగులు



వైఎస్సార్ సీపీ నగర కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న శివ ప్రసన్న

కోర్టు ఆవరణలో..

కాకినాడ లీగల్: కాకినాడ కోర్టు ఆవరణలో మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే బార్ అసోసియేషన్ భవనం వద్ద ప్రెసిడెంట్ ముత్తింటి విశ్వేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 ఆర్వీ రామారావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2 పీఎస్వీఎస్ఎస్ వీరభద్రరావు, ఉద్యోగులు, దస్తావేజు లేఖర్లు పాల్గొన్నారు.

ఏపీఎస్పీలో..

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కమాండెంట్ ఎం.దీపిక జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖరరావు, మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎఫ్సీఎల్ రోడ్డులోని కౌడా కార్యాలయంలో వైస్ చైర్‌పర్సన్ భావన జాతీయ జెండాను ఎగరవేశారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలసి ఆమె నివాళులర్పించారు. రమణయ్యపేటలోని ఏపీఐఐసీ కాలనీలో జోనల్ మేనేజరు అబ్బిరెడ్డి రమణారెడ్డి, పాల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో ఈఈ శంకరరావు, సెట్రాజ్ కార్యాలయంలో సీఈఓ కాశీ విశ్వేశ్వరరావు, మత్స్యశాఖ కార్యాలయంలో జేడీ కరుణాకర్‌రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టరు రాధాకృష్ణ తదితరులు జాతీయ జెండాకు నివాళులర్పించారు.

మండల స్థాయిలో

రమణయ్యపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సతీష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ బందిలి వీరీష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ కుమారి, వీఆర్వోలు పాల్గొన్నారు. పలు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు పలు ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

వలసపాకలలో 36 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ

మండలంలోని వలసపాకల మండల పరిషత్ మెయిన్ స్కూల్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు దేశ నాయకుల వేష ధారణలో ఆకట్టుకున్నారు. హెచ్ఎం నాగవేణి ఆధ్వర్యంలో 36 అడుగుల త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎంఈఓ వేణుగోపాల్ ప్రారంభించారు.

శిల్పారామంలో..

శిల్పారామం ఇన్‌చార్జి పరిపాలన అధికారి మోహన్‌తేజ జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం కాకినాడ బీచ్ రోడ్డు మార్గంలోని శిల్పారామంలో శారద విద్యాలయం విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కరపలో..

కరప: మండలంలోని ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాల్లో, పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేసి స్వీట్లు పంచిపెట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎన్.సత్యనారాయణ, పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐ వి.సూరిబాబు, కరప, వేళంగి పీహెచ్‌సీల వద్ద డాక్టర్ యాంజలిన్, డాక్టర్ ఎంకే సౌజన్య, పశు సంవర్ధకశాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏడీ డాక్టర్ సురేష్‌బాబు, గ్రామ పంచాయతీల వద్ద కార్యదర్శులతో కలసి, సర్పంచ్‌లు మువ్వన్నెల జెండాలను ఎగురవేసి, గౌరవ వందనం చేశారు. మండల విద్యావనరుల కేంద్రం వద్ద ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు జాతీయజెండాను ఎగురవేశారు. వివిధ గ్రామాల్లో జరిగిన గణతంత్ర వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, ఆర్ఐ పవన్, ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు. మండల అంబేద్కర్ యువజన సేవా సంఘం ప్రతినిధులు మారెళ్ల వెంకటరమణ, సాదే వీర్రాఘవులు ఆధ్వర్యంలో ఎస్సీ నాయకులు స్థానిక పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.



వలసపాకల మెయిన్ స్కూల్‌లో దేశ నాయకుల వేషధారణలో విద్యార్థులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ



శిల్పారామంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

జేఎన్‌టీయూకేలో..

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ మురళీకృష్ణ జేఎన్‌టీయూకేలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ విద్యార్థుల కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. డాక్టర్ అబ్దుల్‌కలాం కలలు కన్న విజన్ 2020 సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్, ప్రిన్సిపాల్ మోహనరావు పాల్గొన్నారు.

పలువురికి పురస్కారాలు

కాకినాడ క్రైం: గణతంత్ర వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి. వివిధ శాఖల ఉన్నతాధికారులు జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు వారి పరిధిలోని పలువురు సిబ్బందికి రిపబ్లిక్ డే పురస్కారాలను అందించారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 100 అడుగుల జాతీయ జెండాను మీట నొక్కి జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆవిష్కరించారు. అలాగే ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జెండా ఎగురవేశారు. అదనపు ఎస్పీ భాస్కరరావు, సీఐలు నాగ దుర్గారావు, పెద్దిరాజు, వి.కృష్ణ, వైఆర్‌కే శ్రీనివాస్, రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐలు వినయ్‌ప్రతాప్, సత్యనారాయణ, శ్రీహరిబాబు, జగన్మోహన్, ట్రాఫిక్ ఎస్ఐ మూర్తి సహా పలువురు సిబ్బంది కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

అలాగే కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో డాక్టర్ ఎన్టీఆర్ యూహెచ్ఎస్ వీసీ, రాష్ట్ర డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్వీఎల్ నరసింహం జాతీయ జెండాను ఆవిష్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పరేడ్‌లో డాక్టర్ నరసింహం గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఉత్తమ వైద్యులు, బోధకులకు డాక్టర్ నరసింహం ప్రశంసా పత్రాలు అందజేశారు.



కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న జేసీ రాహుల్ మీనా

జీజీహెచ్ నుంచి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డీటీసీఎస్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ పీవీ ప్రసాద్, నర్సింగ్ ఆఫీసర్ ఎస్‌కె.అమీరున్నీసా, స్టాఫ్ నర్సు ఎం.చిన్నారి కలెక్టర్ చేతుల మీదిగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. క్యాన్సర్ వార్డులో మొక్కలు పెంచుతూ సంరక్షిస్తున్న చిన్నారిని కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేకంగా అభినందించారు. దీంతో ఆమె జీజీహెచ్ అధికారుల ప్రోత్సాహంతో మొక్కలను పెంచి రోగులకు ఆహ్లాదాన్ని పంచుతున్నానని పేర్కొన్నారు. రాష్ట్ర డీఎంఈ డాక్టర్ డీఎస్వీఎల్ నరసింహం చేతుల మీదిగా జీజీహెచ్ అంకాలజీ నిపుణుడు డాక్టర్ కర్ర ప్రదీప్ ప్రశంసా పత్రంతో పాటు మెమెంటో అందుకున్నారు. వీరు కాక, వైద్య ఆరోగ్యశాఖ నుంచి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.సరిత, డిప్యూటీ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ గిరిగణేష్, ఆశా కార్యకర్త సయ్యద్ హసీనా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జిల్లాకు చెందిన నలుగురు ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ రిపబ్లిక్ డే వేడుకల్లో ఆదివారం ఘనంగా సత్కరించారు. కిర్లంపూడి మండలం తామరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్ బి.లక్ష్మీనారాయణ, కాండ్రేగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్ విఠల్, కాకినాడ రేచర్లపేట మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఎం.గంగారామ్, కాకినాడ గాంధీనగర్ మున్సిపల్ కార్పొరేషన్ బాలికల పాఠశాల ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ఎం.సూర్యభాస్కర్‌లు కలెక్టర్ సత్కారం అందుకున్న వారిలో ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి పి.రమేష్ కుమార్ పాల్గొన్నారు.



పోలీస్ శాఖను ప్రశంసిస్తూ పురస్కారాన్ని అందజేస్తున్న కలెక్టర్



ఆర్ఎంసీలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర డీఎంఈ డాక్టర్ డీఎస్వీఎల్ నరసింహం



ప్రశంసా పత్రాలు అందుకున్న జీజీహెచ్ వైద్యాధికారులు డాక్టర్ లావణ్యకుమారి, శ్రీనివాసన్, ఎంపీఆర్ విఠల్, స్టాఫ్ నర్సులు చిన్నారి, అమీరున్నీసా. చిత్రంలో డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్

ఆకట్టుకున్న మోహినీ భస్మాసుర

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిరంలో జరుగుతున్న సంక్రాంతి గాన సభల్లో భాగంగా ఆదివారం రాత్రి చింతా రవి బాలకృష్ణ, వారి శిష్య బృందం ప్రదర్శించిన మోహినీ భస్మాసుర కూచిపూడి నృత్యం అందరినీ ఆకట్టుకుంది. నృత్య కళాకారులు పెదపూడి నాగశ్రీ ప్రవల్లిక, వర్షితా వర్మ, లంకా సుస్మిత, ఎస్.సాయి శ్రీప్రియ, ఎం.ఈశ్వరి, ఎస్.యశశ్రీ, జల్లూరి శరణ్య, ఎం.విజయలక్ష్మి, ఎ.జాహ్నవి, ఎం.భువన, పి.సుచిత్ర శ్రీ, సీహెచ్ లలిత, ఎం.లాస్య, యామిని ప్రియాంక, వై.మేఘన ప్రదర్శించిన కూచిపూడి నృత్య రూపకంలోని పలు ఘట్టాలు అందరినీ మైమరపించాయి. తొలుత ఈ కార్యక్రమాన్ని రిలయన్స్ సీఎస్ఆర్ హెడ్ సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్వత్సభ కార్యవర్గ సభ్యులు వక్కలంక రామకృష్ణ, వక్కలంక కమల, గట్టి శ్రీకృష్ణ దేవరాయలు, చావలి సూర్యకుమారి, నల్లమిల్లి మణిబాబు పాల్గొన్నారు.



మోహినీ భస్మాసుర ఘట్టంలోని సన్నివేశం

నాటిక రచన పోటీల విజేతలు వీరే

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): తెలుగు రాష్ట్రాల స్థాయిలో పంపన సంస్కృతీ పురస్కార్ ఆధ్వర్యంలో నిర్వహించిన నాటిక రచన పోటీల్లో విజేతల వివరాలను ఆదివారం ప్రకటించారు. దంటు క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పంపన సంస్కృతీ పురస్కార్ అధ్యక్షుడు పంపన దయానందబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాటిక రచనల పోటీల న్యాయ నిర్ణేతలు సాంస్కృతిక శాఖ మాజీ సీఈవో విజయభాస్కర్, చరిత్ర పరిశోధకులు కందిమండ్ల సాంబశివరావు, వాడ్రేవు సుందర్రావు పాల్గొని విజేతల వివరాలు తెలియజేశారు. ప్రథమ బహుమతిని హైదరాబాద్‌కు చెందిన 'ముడుపు' రచయిత సింహప్రసాద్, రెండో బహుమతిని విజయనగరానికి చెందిన ఎం.దుర్గాప్రసాద్ రచించిన 'మనిషి కన్నా శవం మిన్న', తృతీయ బహుమతిని విశాఖపట్నానికి చెందిన పీటీ మాధవ్ రచించిన 'జనరల్ బోగీలు' గెలుచుకున్నాయి. ప్రత్యేక బహుమతిని సామర్లకోటకు చెందిన కె.ఆనంద్ రచించిన 'ఆత్మహత్య', కన్సొలేషన్ బహుమతులను 'పసిడివనం' రచయిత స్నిగ్ధ, 'గేమ్' రచయిత మంజునాథ్, 'కర్మశాల' రచయిత బొక్కా శ్రీనివాసరావు, 'వెలుతురు వెనుక' రచయిత రావి నాగేశ్వరరావు, 'సూక్తం' రచయిత కేవీవీ సత్యనారాయణ గెలుచుకున్నారు. విజేతలకు ఏప్రిల్ 20న సీతారామరాజు స్మారక కళావేదిక 11వ వార్షికోత్సవం సందర్భంగా నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళావేదిక అధ్యక్షుడు కర్రి అచ్యుతరామారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి చెస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): చిన్నారుల మెదడుకు మరింత పదును పెట్టేందుకు సెకండ్ వరల్డ్ చెస్ అకాడమీ ఆధ్వర్యాన జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని ఎస్‌డబ్ల్యూసీఏ కోచ్ సాయికుమార్ తెలిపారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సూర్య కళామందిరంలో ఆదివారం ఈ పోటీలు జరిగాయి. జిల్లాకు చెందిన చెస్ ఆర్బిటర్ మనోహర్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లావ్యాప్తంగా 272 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మొదటి పది ర్యాంకులు సాధించిన క్రీడాకారులకు నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు, తల్లిదండ్రులకు సుమారు 500 మందికి హరీష్ స్పోర్ట్స్ నిర్వాహకులు టి.హరీష్ ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. విజేతలకు సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు కొండబాబు, నానాజీ బహుమతులు అందజేశారని సాయికుమార్ తెలిపారు.

పురుగు మందుతాగి వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: కొత్తపేట మండలం బిల్లకుర్రు గ్రామానికి చెందిన తాటిపాక మణికంఠ (31) వ్యక్తిగత కారణాలతో పురుగు మందు తాగి ఈ నెల 25న కాకినాడ జీజీహెచ్‌లో చేరాడు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

చికిత్స పొందుతూ..

రంగంపేట మండలం కోటపాడు గ్రామానికి చెందిన కోనే చక్రరావు (44) వ్యక్తిగత కారణాలతో పురుగుల మందుతాగాడు. రాజమహేంద్రవరంలో చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం కోసం ఈ నెల 17వ తేదీన కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

నూతన కమిటీని నియమించాలి

బోట్‌క్లబ్: అందరి సభ్యుల ఆమోదంతో నూతన కమిటీని నియమించాలని స్థానిక జగన్నాథపురం చర్చ్ స్క్వేర్ సెంటర్ చర్చి సభ్యులు ఆదివారం ధర్నా చేశారు. సభ్యుల ఆమోదంతో అందరికీ స్థానం కల్పించి నూతన కమిటీని నియమించాలన్నారు. నలుగురు వ్యక్తుల ఆధిపత్యం వల్ల సంఘంలో ఉన్న మిగిలిన వారందరూ ప్రార్థన సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోందన్నారు. దైవ ప్రార్థన మందిరాల్లో అందరూ కలసిమెలిసి ఉండాలన్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు.



చర్చి వద్ద ధర్నా చేస్తున్న సభ్యులు

ఉత్తమ సేవలకు పురస్కారాలు



(కుడి నుంచి ఎడమ వైపు) కాకినాడ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ల నుంచి అవార్డులు అందుకుంటున్న రిజిస్ట్రేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ కేవీ శ్రీనివాస్‌రెడ్డి, రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎస్సార్ హెడ్ సుబ్రహ్మణ్యం, కరప ఎస్ఐ సునీత, మండల ఇంజనీరింగ్ అధికారి శైలజ, సామాజిక సేవా కార్యకర్త తాతీలు

కాకినాడ లీగల్/బోట్‌క్లబ్/కరప: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురు అధికారులు జిల్లా పెరేడ్ గ్రౌండ్స్‌లో కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు. వారిలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కేవీ శ్రీనివాస్‌రెడ్డి, సామాజిక బాధ్యతలో భాగంగా విద్య, వైద్య అభివృద్ధికి, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలకు నిధులు ఇస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎస్ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం, కరప ఎస్సై తోట సునీత, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ, సామాజిక కార్యకర్త, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఉత్తమ పురస్కారాలను అందుకున్నారు.